# 105. నేనెవరో నీకు తెలుసా?

భమిడిపాటి కామేశ్వరరావు గారి "కాలక్షేపం" అనే పుస్తకంలో ఓ జోకు ఉంది. ఒక జోకు వుండడమేమిటి, ఆ పుస్తకం అంతా జోకులే. తెలుగులో వొచ్చిన మొట్టమొదటి జోక్ బుక్ అదే అయ్యుండాలి.

'కాలక్షేపం' నూరేసి పేజీల చొప్పున రెండు సంపుటాలు. ఇప్పుడయితే కార్టూన్ కలెక్షన్లు జోక్ బుక్కు చాలానే వొచ్చున్నాయి. కాని వాట్లో ఎక్కువ భాగం ఇంగ్లీషు జోక్ పుస్తకాల్లోంచి సంగ్రహించినవే అని తోస్తుంది.

జోక్సుకి - గాలికీ నీటికీ లాగ కాపీరైటు ఉండదని జోక్శాస్త్రజ్ఞులు కొందరు చెపుతారు.

అందుకే కదా, నేనిప్పుడు భమిడిపాటి కామేశ్వర్రావు గారి జోకు వుదహరించడానికి వుపక్రమిస్తి. ఆ జోకు ఏంటంటేనూ -

ఓ వూళ్లో యిద్దరు కవల అన్నదమ్ములుండేవార్ట. కవల అన్నదమ్ముల్లో ఒక విచిత్రమైన పరిస్థితి తప్పకుండా వుంటుంది. అదే - వాళ్లిద్దరూ పుట్టడం వరకూ ఒకే రోజుని - ఆ మాట కొస్తే వొకే గంటకి పుట్టొచ్చు. కాని ఒకేసారి చావడం మాత్రం కుదిరేపని కాదు.

అలాగున - ఆ యిద్దరన్నదమ్ముల్లో వొకడు పోయాట్ట. ఆ పోయిన కొద్ది రోజులికి బతికున్నాయన రోడ్డంట నడుస్తుంటే వొకాయన ఎదురుపడి -

"ఈ మధ్య పోయింది నువ్వా, మీ బ్రదరా?" అని అడిగేశాట్ట. కవలాళ్లలో ఎవరు ఎవరనేది గుర్తుంచుకోడం గుర్తుపట్టడం చాలా కష్టం అని చెప్పడంలో ఒకానొక ఎక్స్ట్రీమ్కి చెందిన జోకు ఇది.

కవలల్లో తనక్కావలసింది - పోనీ తను ప్రేమించింది - ఎవరో గుర్తు పట్టలేక ప్రియుళ్ళూ, ప్రియురాళ్ళూ, రాళ్లు తన్నుకున్నప్పట్లా గాభరాపడి పెద్ద సంఘర్షణలకి దారితీసినట్టు ఎన్నో నవలల్లోనూ, మరెన్నో సినీమాల్లోనూ మనకి చూపించేరు.

అంచేత భమిడిపాటి కామేశ్వర్రావు గారి జోకు ఇంటిపేరు బలంతో నేను తస్కరించి మీకు చెప్పేను; లిఫ్ట్ ఇరిగేషన్ - అనగా ఎత్తిపోతల పథకం కిందని.

కవలాళ్ల సంగతి అలా ఉంచి, నా కెంత మతిమరుపంటేనూ, కవలలు కానివాళ్లని కూడా నేను వెంటనే గుర్తుపట్టలేకపోవడం అవుతోంది.

నా దార్ని నేను పోతూ వుంటానా, ఎవరో వొకరు ఒక నమస్కార బాణంతో కొట్టి నన్ను ఆపుతారు. "బావున్నారా" అంటారు.

"ఆఁ ఏదో మీ దయవల్ల-" అంటాను.

"నా దయేంటి సార్, భగవంతుడి దయుండాలి!" అంటారు. పేరుపేరు వరసనీ మా కుటుంబంలో అందర్నీ గురించీ భోగట్టా చేస్తారు.

ఇతనెవరా అని మనస్సులో అన్వేషణ సాగించుకుంటూనే అతనడిగిన ప్రశ్నలకి సమాధానాలు చెప్తాను.

నేనన్నట్టు అతనికి నామీద దయేవుంటే -

"సంతోషం సార్. చాల్రోజులకి కనిపించేరు. వస్తాను" అని ఓ అబద్ధం చెప్పి వెళ్తాడు.

(వస్తానని చెప్పి వెళ్లిపోవడం అబద్ధమే కదా.)

దయలేని వాడైతే ఇంకేముంది...! "ఇంతకీ నేనెవరో గుర్తుపట్టేరా అసలూ?" అని అడిగేసి నా గుట్టు నడిరోడ్డు మీద పడేసి మరీ వెళ్తాడు.

బావున్నారా - అన్న ప్రశ్న చాలా సాధారణం.

ఒకసారి నేను డాక్టరు గారి దగ్గిరకెళ్లాను. ఆయన నాకు ఒక సాహిత్య సభలో పరిచయం అయ్యేడు. నన్ను చూడగానే "బావున్నారా" అని స్టాక్ కొశ్చను వేసేడు. నేను మాత్రం "ఏదో మీ దయవల్ల" అని స్టాక్ ఆన్సర్ చెప్పలేదు.

"ఊర్కోండిసార్. బావుంటే మీ దగ్గిర కెవడొస్తాడు!" అనీసేను.

వృత్తిరీత్యానూ ప్రవృత్తి రీత్యానూ నన్ను గుర్తుపట్టి పలకరించే వాళ్లు బాగా ఎక్కువమందే వుంటారు. ఏం చెయ్యనూ; ముప్ఫయ్యో ఏడు వొచ్చిందగ్గిర్నుంచీ ఇదే పొట్ట; ఇదే బట్టతల, ఇదే రూపు, ఇదే చూపు.

అంచేత నన్ను గుర్తుపట్టి పలకరించే వాళ్లు ఎక్కువే. అందులో కొందరు "గుర్తించి" పలకరించే వాళ్లు కూడా వుంటారనుకుంటాను. కాని వాళ్లలో నూటికి డెబ్బయిమందిని నేను పోల్చుకోలేక - అందులో మళ్లీ నూటికి ఎనభైమందికి దొరికిపోతూ వుండడం నా దురదృష్టాల్లో వొకటి-

ఏమిటీ - దురదృష్టాలు ఇంకా వున్నాయా అని అడుగుతున్నారా? ఉన్నాయున్నాయి. నా దురదృష్టాల్లిస్టు పూర్తిపాఠం అదో గ్రంథం అవుతుంది.

నా మిత్రుడు శర్మగారు నాకో సూత్రం చెప్పేడు. నమస్కారం సార్ అని ఎవరయినా పలకరిస్తే - ఆఁ, ఆఁ, నమస్కారం, నమస్కారం - అనేసి చేత్తోకూడా నమస్కారం చెయ్యడం వరకూ రైటే.

ఆ తరువాత "ఎక్స్యూజ్ మి - మీరెవరో పోలిక దొరకడం లేదు" అని వొప్పేసుకోడం అన్నివిధాలా మంచిది. అలా వొప్పేసుకోడానికి ఆభిజాత్యం అడ్డొస్తే -

"ఆఁ - ఇప్పుడెక్కడా, వుండడం? మీ అన్నయ్యగారు - అదే, ఆయన పేరేంటి చెప్మా -" అంటూ కొన్ని లీడింగ్ కొశ్చన్లు వేస్తే వ్యవహారం కొంత దార్ని పడుతుంది.

అవతలి మనిషి తనింకా ఆ ఫలానా వూళ్లోనే అఘోరిస్తున్నాననో, వాళ్లన్నయ్య పేరు ఫలానా అనో బైటపెడతాడు. ఈలోగా ఆ క్లూలు అందుకుని అతనెవరో గుర్తుపట్టెయ్యొచ్చు. ఇలా చాలా కేసుల్లో ఒడ్డెక్కేను.

అయితే వొకనాడు -

నాకంట్లో నమస్ కారం జల్లి నన్ను అటకాయించిన ఒకాయన మీద "ఆఁ-ఇప్పుడెక్కడా, వుంటం?" అని శర్మాస్త్రం ప్రయోగించేను.

"ఇంకెక్కడా? జైల్లోనే!" అన్నాడతను.

క్షణంసేపు గాభరాలోనూ సానుభూతిలోనూ పడ్డాను.

"పెరోల్‌మీద వొచ్చేరా?" అన్నాను.

"పెరోలేమిటండీ బాబూ? పెరోలూ కాదు, బెయిలూకాదు. హుఁ. నన్ను గుర్తుపట్టలేదన్న మాట.... నేనండీ, శాస్త్రిని! మీ మేనత్త కూతురు వెంకట నరసమ్మగారి అల్లుణ్ణి! నాకు జెయిల్లో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం కదా, ఈవూళ్లో! మర్చిపోయేరా?" అని గడగడలాడి నన్ను

దడదడలాడించేడు.

శర్మాస్త్రం - అంటే ఆ శర్మగారి అస్త్రం - ఓసారి శర్మగారికే ఎదురు తిరిగిన సంఘటన ఉంది. మామూలుగా శర్మగారూ నేనూ కలిసి నడుస్తున్నాం. ఇంతలో ఓ ఆయన రోడ్డుకి ఆవలివేపునించి నమస్కారం శర్మగారూ అంటూ చకచకా యిటువేపు వచ్చేడు. శర్మగారు ఆ నమస్కారానికి ప్రతిస్పందించిన విధానం చూసేను.

అదే - 'ఆఁ - ఇప్పుడెక్కడుంటున్నారు - మీ అన్నయ్యగారు-' అదంతా అన్నమాట.

అదంతా చూసి శర్మగారు అతన్ని గుర్తుపట్టలేదని గ్రహించాను.

దొంగను పట్టుటకు దొంగయే కావలెను - అని కదా సూక్తి! సరే, కాసేపు అతనూ, శర్మగారూ ఒకరికొకరు తీసిపోకుండా ప్రశ్నలూ జవాబులూ వింబుల్డన్ ఆటగాళ్లలా విసిరి కొట్టుకున్నారు. అవతలాయనకీ తెలిసిపోయింది సంగతి.

"సరే, నేనెవరో మీకు గుర్తురాలేదని తెల్సిపోయింది." అని ఆయన నవ్వేడు.

శర్మగారు ఇంకా వోటమి అంగీకరించలేదు "రండి, కాఫీ పుచ్చుకుందాం" అని వెనక్కి తిరిగిపోయి పక్కనేవున్న హోటల్లోకి దారితీసేడు.

లోపలికెళ్లాక శర్మగారు ఈ ఆట కాసేపు పక్కకి పెట్టి కాఫీ ఆర్డర్ చెయ్యడంలో పడ్డాడు.

ఆయనకూడా ఇతనికి కొంచెం ఆటవిడుపు ఇద్దామన్నట్టుగా కాఫీ అక్కడుంచి చేతులు కడుక్కోడానికన్నట్టు వాష్ బేసిన్ దగ్గిరికెళ్లేడు.

"గడ్డుకేసే తటస్థ పడ్డాది. పోనీ అతనిటు రాగానే మీరు వాష్ బేసిన్ దగ్గిరి కెళ్లండి, నేను చిటికెలో కనుక్కునేసి వాష్ బేసిన్ దగ్గిరికొచ్చి ఉప్పందిస్తాను" అన్నాను. ఇంతలోకే ఆయన రానే వచ్చేడు.

'రేపు మీ ఆఫీసుకొస్తాను. మావూరి కోపరేటివు సొసైటీకి సంబంధించిన ఫైలు మీ డిప్యూటీ రిజిస్ట్రార్ గారి దగ్గిర వుంది. మీరొక్క మాట సాయం చెయ్యాలి" అన్నాడు; శర్మగారితో.

"దాందేముంది; చెప్తాలే, రండి" అన్నాడు శర్మగారు.

కాఫీలయ్యాక అతనే బిల్లు చెల్లించాడు. కానీ, కొంటెతనం దాచుకోకుండా అన్నాడు. "రేపు వస్తానుగా, అప్పటికి గుర్తొస్తాను నేనెవరో!" అని హోటలు మెట్లు దిగాడు.

శర్మగారు నన్ను ఆపాడు. "చూడండి! నా దగ్గిరికి పనిమీద వొచ్చాడు. ఫలానా అని చెప్పేడ వొచ్చుగా" అన్నాడు.

నేనేమీ అన్లేదుగాని - శర్మగారు చప్పట్లు కొట్టి అతన్ని ఆపేడు. "ఆగండాగండి" అని. అతనాగేడు.

"గుర్తొచ్చేనా?" అన్నాడతను.

"ఎక్కడ చూసేనా అని యిందాకట్నుంచీ గింజుకు చస్తున్నాను. చివరికి సైడు పోజులో చూసేసరికి గుర్తొచ్చేరు..." అన్నాడు శర్మగారు నవ్వుతూ. "అదే. ఈ రోజు ఆదివారం కదా. మరి నిన్న శనివారమే కదా. రాత్రి ఒంటిగంట వరకూ క్లబ్‌లోనే వున్నాను, పేకాడుతూ. చిత్రం ఏంటంటే; ప్రతి పంపకంలోనూ ఒక ముక్క తప్పకుండా వొచ్చిపడేది. అదే; డైమాన్ జాకీ!"

ఆ మనిషి మొహం "ఇంత" చేసుకుని వెళ్ళిపోయాడు.

మర్నాడు అతను శర్మగారి ఆఫీసుకి వెళ్లినా ఆయన సాయం తీసుకోకుండానే తన పని పూర్తి చేసుకోవలసుందని నాలో నేను అనుకున్నాను. ★